సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



బాలిక కుటుంబాన్ని ఆదుకుంటాం

లైంగికదాడికి గురైన నాలుగేళ్ల బాలిక కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ అన్నారు. 8లో ▸



గోదావరికి మళ్లీ వరద

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మళ్లీ పెరుగుతుండటంతో నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. శబరి ఎగపోటు ఆందోళన కలిగిస్తోంది. 8లో ▸



అడవి తల్లే ఆరాధ్య దైవం

అడవితల్లి బిడ్డలకు ఆచారాలు, సంప్రదాయాలే బలం. నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. 8లో ▸

గురువులపై సర్దుబాటు కత్తి

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు చంద్రబాబు 'మార్కు' పాఠం చెప్పారు. బడుల్లోని ఉపాధ్యాయుల కొరతతో పాటు మిగులు సమస్యలు పరిష్కరిస్తారని భావిస్తున్న తరుణంలో గురువుల మెడపై పని సర్దుబాటు కత్తి పడింది. 117 జీఓ రద్దు చేస్తారని అంతా భావిస్తున్న తరుణంలో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో హడావుడిగా ఉపాధ్యాయుల సర్దుబాటు ముగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి.

బాబు మార్కు పాఠం

- కూటమి అధికారంలోకి వస్తే 117 జీఓ రద్దు చేస్తామని హామీ
- ప్రస్తుతం ఈ హామీని పక్కనపెట్టి సర్దుబాటు పేరుతో బదిలీలకు శ్రీకారం
- ఉపాధ్యాయ సంఘాల మండిపాటు
- 10 మందిలోపు విద్యార్థులున్న స్కూళ్లు భవిష్యత్‌లో మూతే
- నాలుగు రోజుల్లో సర్దుబాటు ప్రక్రియ పూర్తిచేయాలని ఉత్తర్వులు
- పూర్తిగా నష్టపోతామంటున్న జూనియర్ టీచర్లు



నిడమర్రు మండలం బువ్వనపల్లిలో సత్యనారాయణపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

నిడమర్రు: కేవలం నాలుగు రోజుల్లోనే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారుల నుంచి మార్గదర్శకాలు జారీ అయ్యాయి. శుక్రవారం నుంచి కసరత్తు ప్రారంభించి ఈనెల 12 నాటికి ప్రక్రియ పూర్తి చేయనున్నారు. తొలిరోజు మండల స్థాయిలో పని సర్దుబాటు చేసి మిగిలిన ఉపాధ్యాయులకు 10,11 తేదీల్లో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ పూర్తి చేయడంతోపాటు అదే రోజు నియామక ఉత్తర్వులు జారీ చేయనున్నారు. 12న నూతన బదిలీ స్థానాల్లో విధులకు హాజరవ్వాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రతిపాదికన జరగనుంది. వీరంతా ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసే వరకు (2025 ఏప్రిల్ 23) ఆయా స్థానాల్లో తాత్కాలిక ప్రాతిపదికన విధులకు హాజరుకావాల్సి ఉంటుంది. అంధత్వం ఉన్న ఉపాధ్యాయులు, వచ్చే ఏప్రిల్ 31 నాటికి ఉద్యోగ విరమణ చేస్తున్న ఉపాధ్యాయులను సర్దుబాటు నుంచి మినహాయించారు.

స్పష్టత కరువు

ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ స్కూల్ అసిస్టెంట్ టీచర్లను సర్దుబాటు చేస్తారు. యూపీ స్కూల్‌లో 98 కంటే తక్కువ నమోదు ఉంటే 3 నుంచి 8వ తరగతులు, 1 నుంచి 2వ తరగతులు విడిగా విభజించి ఉపాధ్యాయులను కేటాయిస్తారు. అయితే ఏ విధంగా కేటాయిస్తారో మార్గదర్శకాల్లో స్పష్టత లేదని సంఘ నాయకులు అంటున్నారు. అన్ని స్థాయిల్లో మిగులు ఉపాధ్యాయులు ఉన్నట్లు గుర్తిస్తే మిగులు పరిధి ఆధారంగా ఏకోపాధ్యాయ పాఠశాలల్లో అవరోహణ క్రమంలో సర్దుబాటు చేస్తారు. బడిలో జూనియర్ టీచర్‌ను మిగులు (సర్‌ప్లస్)గా గుర్తిస్తారు. హైస్కూల్ ప్లస్ పాఠశాలలను సర్దుబాటు ప్రక్రియ నుంచి మినహాయించారు.

మార్గదర్శకాలు ఇలా..

- పని సర్దుబాటుకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది.
- ముందుగా సబ్జెక్ట్ టీచర్లు, ఎస్జీటీలు ఒకే సబ్జెక్ట్‌లోని అన్ని మేనేజ్‌మెంట్‌ల (ప్రభుత్వ / జెడ్పీ/ మున్సిపల్) పరిధిలోని పాఠశాలల అవసరాల ఆధారంగా సర్దుబాటు చేస్తారు.
- మిగులు స్కూల్ అసిస్టెంట్లను వారి విద్యార్హత ఆధారంగా ఇతర సబ్జెక్టులకు సర్దుబాటు చేస్తారు.
- అర్హత కలిగిన మిగులు ఎస్జీటీలు సంబంధిత డిగ్రీ, బీఈడీ కలిగి ఉంటే సంబంధిత సబ్జెక్టులోని మెథడాలజీని పరిగణనలోకి తీసుకుని యూపీ, ఉన్నత పాఠశాలల్లో బోధించేలా సర్దుబాటు చేస్తారు.
- ఒకటి కంటే ఎక్కువ పీడీ లేదా పీఈటీలు ఉన్న పాఠశాలలను గుర్తించి వారిని ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేస్తారు.

పాఠశాలల మూసివేతకు కుట్ర



నలుగురు విద్యార్థులే ఉన్న బువ్వనపల్లి ఏఏ స్కూల్

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 117 జీఓ రద్దు చేయాలంటూ ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పని సర్దుబాటు పేరుతో పది మందిలోపు విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను మూసి వేసేందుకు కుట్ర జరుగుతోందని సంఘాల నాయకులు మండిపడుతున్నారు. 117 జీఓ రద్దు చేయకుండా సర్దుబాటు పేరుతో బదిలీలు నిర్వహిస్తే మిగులు ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతారని అంటున్నారు. అలాగే పాఠశాలలో మిగులు పోస్టుల్లో ఉన్న జూనియర్ టీచర్లకు అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు.

❝

భవిష్యత్‌లో స్కూళ్లు మూతే..



పని సర్దుబాటు వల్ల ఆ పాఠశాలలో మిగులు టీచర్లలో జూనియర్ టీచర్లకు అన్యాయం జరుగుతుంది. అలాగే 10 మంది లోపు విద్యార్థులున్న ప్రభుత్వ స్కూళ్ల మూత పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఉంగుటూరు నియోజకవర్గంలో 25 స్కూళ్లలో 10 మంది లోపు విద్యార్థులు ఉన్నారు. 2 స్కూళ్లలో ఈ విద్యా సంవత్సరంలో ఒక్క విద్యార్థి లేని పరిస్థితి. 117 జీఓ రద్దు తర్వాతే ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలి.

– పువ్వాల ప్రకాష్‌రావు, రాష్ట్ర కార్యదర్శి, ఎస్టీయూ

117 జీఓ రద్దు తర్వాతే..



కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు 117 జీఓ రద్దు తర్వాతే పని సర్దుబాటు ప్రారంభించాలి. ఈ జీఓ రద్దు చేయక పోగా తిరిగి అదే జీఓ ప్రకారం పని సర్దుబాటు చేయడం ఎంతవరకు సబబు. ప్రభుత్వ పెద్దలు ఆలోచించుకోవాలి. సమాంతర మీడియం అమలుతో గ్రామాల్లోని పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. అలాగే ఉపాధ్యాయుల పోస్టుల సంఖ్య పెరుగుతుంది.

– బొద్దు రమేష్, గౌరవ అధ్యక్షుడు, యూటీఎఫ్

ఏ స్కూలూ మూతపడలేదు



ఈ విద్యా సంవత్సరంలో నమోదు లేని బువ్వనపల్లి సత్యనారాయణపురం పాఠశాలను మూయలేదు. విద్యార్థుల నమోదు ఉంటే ఆ స్కూల్ తెరుస్తాం. మండలంలో 10 మందిలోపు రోలు ఉన్న స్కూళ్లు తొమ్మిది ఉన్నాయి. పని సర్దుబాటులో ఆరుగురు మిగులు ఉపాధ్యాయులుంటే ఆరుగురు అవసరం ఉంది. ఉన్నతాధికారుల మార్గదర్శకాల ప్రకారం పని సర్దుబాటు చేస్తాం.

– పుచ్చుల శేషు, ఎంఈఓ, నిడమర్రు

న్యూస్‌రీల్

జెడ్పీ చైర్‌పర్సన్‌కు అవమానం

ఆదివాసీ దినోత్సవానికి అందని ఆహ్వానం



జెడ్పీ చైర్‌పర్సన్ పేరు లేని ఆహ్వాన పత్రిక

ఏలూరు(మెట్రో): ఆదివాసీ దినోత్సవాన్ని జిల్లా అధికారులు శుక్రవారం కోటరామచంద్రపురం ఐటీడీఏలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు, తెలుగుదేశం, జనసేన శ్రేణులు ప్రొటోకాల్ ఉల్లంఘనకు తెరదీశారు. సాక్షాత్తు జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పేరును ఆహ్వాన పత్రికపై ప్రచురించకుండా అవమానపరిచారు. జిల్లాలో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లకు ఆహ్వానం అందించి రశీదులు సైతం పొందాలని ఐటీడీఏ పీఓ శ్రీనుకుమార్ ఆదేశాలు జారీ చేశారు. అయితే జెడ్పీ చైర్‌పర్సన్ పేరును మాత్రం కనీసం ఆహ్వాన పత్రికలో ప్రచురించలేదు. ఇదంతా రాజకీయ దురుద్దేశంతోనే చేసినట్టు తెలుస్తోంది. జెడ్పీ చైర్‌పర్సన్ వైఎస్సార్‌సీపీ తరఫున ఎన్నికయ్యారనే కారణంతోనే కూటమి నాయకులు ఆమె పేరును ఆహ్వాన పత్రికలో లేకుండా చేసినట్టు తెలిసింది. ఇప్పటికే దాడులకు తెగబడుతున్న టీడీపీ, జనసేన శ్రేణులు ఇలా కొత్త వివాదాలకు సైతం తెరదీస్తున్నారు.

జిల్లా అభివృద్ధికి సహకరించాలి



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): జిల్లా అభివృద్ధికి జిల్లా పరిషత్ సభ్యులంతా సహకరించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. స్థానిక జెడ్పీ క్యాంపు కార్యాలయంలో గురువారం జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులతో చాంబర్ నూతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సభ్యులంతా జిల్లా అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం సభ్యులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోల్నాటి శ్రీనివాసరావు (బాబ్జి), ఉపాధ్యక్షురాలిగా కోరిపల్లి జయలక్ష్మి, సెక్రటరీగా బొక్కా రాధాకృష్ణ, జాయింట్ సెక్రటరీగా మోలుగుమాటి నీరజ, ట్రెజరర్‌గా కొయ్యే సూర్యారావు, కార్యవర్గ సభ్యులుగా గుజ్జా రామలక్ష్మి, రణస్థల కనకదుర్గ, చిగురుపాటి శ్యామ్యూల్, మల్లం వసంతరావులను ఎన్నుకున్నారు.

ఈ-పంట నమోదుపై సమీక్ష

భీమవరం: ఈ-పంట నమోదులో వాస్తవ పంట సాగుదారులను మాత్రమే నమోదు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రెవెన్యూ, అగ్రికల్చర్, హార్టికల్చర్, మత్స్యశాఖల అధికారులతో ఈ-క్రాప్ నమోదుపై ఆమె సమీక్షించారు. వాస్తవ పంట సాగుదారులను మాత్రమే నమోదు చేసేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ ప్రక్రియ వచ్చే నెల 15లోపు పూర్తిచేయాలని, వచ్చేనెల 30 నాటికి జాబితాను ప్రదర్శిస్తామన్నారు. ఈ-ఫిష్ నమోదైన భూమిలో వరి పంట సాగు చేస్తుంటే వరి పంటను మాత్రమే నమోదు చేయాలని, జిల్లాస్థాయిలో ఆన్‌లైన్‌లో పంట మార్పుకు అవకాశం ఉందని స్పష్టం చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.దేవానంద్ కుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్‌వీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

నాణ్యమైన ఆక్వా ఉత్పత్తులతోనే మనుగడ

భీమవరం: నాణ్యమైన ఆక్వా ఉత్పత్తుల ఎగుమతికి, కార్మికుల సంరక్షణకు కృషిచేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం భీమవరం కలెక్టరేట్‌లో ఆక్వా రైతులు, ఉత్పత్తిదారులు, డీలర్లు, ఎగుమతిదారులు, ఎంపెడా, మత్స్యశాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. దేశ రొయ్యల రంగంపై యూఎస్ మీడియా చేస్తున్న ఆరోపణలు, ప్రతికూల ప్రచారంతో రొయ్యల ఎగుమతిపై ప్రభావం పడుతుందన్నారు. వీటిని గట్టిగా తిప్పికొట్టకపోతే ఆక్వారంగం పూర్తిగా దెబ్బతింటుందన్నారు. ఆక్వా ఉత్పత్తుల్లో అత్యంత నాణ్యత, ప్రమాణాలు పాటించాలన్నారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, జిల్లా ఎంపెడా అధికారి టీజీ మనోజ్‌కుమార్, జిల్లా మత్స్య శాఖాధికారి ఎన్‌వీఎస్ ప్రసాద్, పరిశ్రమల శాఖ జీఎం యు.మంగపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌కు కదిలిన యంత్రాంగం

- 'సాక్షి' కథనాలతో దిగొచ్చిన ప్రభుత్వం
- ఈ-పంట నమోదుకు చర్యలు
- జిల్లాలో 2.19లక్షల ఎకరాల్లో వరి సాగు



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న దృశ్యం

భీమవరం: కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు ఈ-క్రాప్ నమోదుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి సీజన్‌లోనూ ఈ-క్రాప్‌ను పక్కాగా నమోదు చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చింది. రాయితీపై విత్తనాల నుంచి పంట విక్రయాల వరకూ అండగా నిలిచింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు నెలలు కావస్తున్నా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదు చేయకపోవడంతో అన్నదాతలు ఆందోళనలు చెందారు. దీనిపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురించగా ఎట్టకేలకు ప్రభుత్వం దిగొచ్చింది. ఈ-క్రాప్ నమోదుకు వ్యవసాయశాఖకు ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు ప్రక్రియ చేపట్టారు. ఈ-క్రాప్ నమోదుకు సంబంధించి గతంలో ఉన్న విధానంలో స్వల్ప మార్పులు చేశారు. గతం నుంచే జియోఫెన్సింగ్ విధానాన్ని అమలు చేస్తుండగా కొత్తగా ఫేషియల్ రికగ్నేషన్, ఈ-ఫిష్ డేటా వంటి వాటితో రైతులు వేసే పంట నమోదును ఈ-క్రాప్‌లో చేరుస్తున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో సుమారు 2.19 లక్షల ఎకరాల్లో వరి సాగుచేస్తుండగా వీటన్నింటి వివరాలు నమోదు చేయనున్నారు. రైతులు తమ పంట వివరాలు ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవడానికి సెప్టెంబర్ నెలాఖరు వరకు సమయముందని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా సిబ్బంది వివరాలు నమోదు చేస్తారని, జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు ప్రక్రియను పర్యవేక్షిస్తుందని చెప్పారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో కో-ఆపరేటివ్ సంఘాలు, అనుబంధ బ్యాంకులను మరింత బలోపేతం చేసి ఉత్తమ సేవలందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 122 సహకార సంఘాలు ఉన్నాయని వీటన్నింటినీ కంప్యూటరైజేషన్ చేయాలన్నారు.

సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలోని చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీరు, శానిటేషన్, వీధి ఎల్‌ఈడీ దీపాలు, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, మండల స్థాయిలో గ్రామ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు మూడు రోజులు శిక్షణ కార్యక్రమాలు, హౌస్‌టాక్స్ తదితర 15 అంశాలపై అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లాలో 383 చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను అక్టోబరు 2 నాటికి పూర్తిస్థాయిలో వాడకంలోకి తీసుకురావాలన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌కు సబ్సిడీ

విద్యుత్ ఆదాకు సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని కలెక్టర్ నాగరాణి కోరారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. కిలో వాట్ సోలార్ రూఫ్ ఏర్పాటుకు రూ.65 వేలు ఖర్చవుతుందని, దీనిలో రూ.30 వేల సబ్సిడీ ఇస్తారని కలెక్టర్ తెలిపారు.



బొప్పాయి.. బాగుంది బడాయి

బొప్పాయిని కోయగా లోపల గింజలతో పాటు రెండు మొక్కలు మొలిచి ఆకట్టుకున్నాయి. కైకలూరు టౌన్‌హాల్ ఎదుట శ్రీనివాసరావు ఇంటి ఆవరణలో ఆరు నెలలుగా పెంచుతున్న బొప్పాయి చెట్టుకు కాసిన కాయను గురువారం కోశారు. కాయలో గింజలతో పాటు మొక్కలను చూసి ఆశ్చర్యపోయారు. దీనిపై జిల్లా ఉద్యాన అధికారి కరణ్‌ను వివరణ కోరగా వాతావరణంలో తేమశాతం ఎక్కువగా ఉంటే కాయ లోపల విత్తనం మొలకెత్తుతుందన్నారు. వైల్డ్‌టైప్ జాతిగా వీటిని భావిస్తారని, సుడో వీవీ ప్యారటీ అని అంటారన్నారు. అరుదుగా మాత్రమే ఇలాంటి కాయలు కనిపిస్తాయన్నారు.

– కైకలూరు

ఏలూరు.. పోటెత్తిన తమ్మిలేరు

- లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తం
- శనివారపుపేట కాజ్‌వేపైకి వరద నీరు
- 8 వేలకు పైగా క్యూసెక్కుల నీటి విడుదల



ఏలూరు తంగెళ్లమూడి వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తమ్మిలేరు

ఏలూరు టౌన్/ఏలూరు టూటౌన్: ఏలూరు నగరానికి తమ్మిలేరు వరద ముప్పు పొంచి ఉంది. నాగిరెడ్డిగూడెం జలాశయం నుంచి వరద నీటిని విడుదల చేయడంతో పెద్ద ఎత్తున తమ్మిలేరులోకి వచ్చి చేరుతుంది. దీంతో నాగిరెడ్డిగూడెం జలాశయం ప్రాంతం నుంచి ఏలూరు వరకు తమ్మిలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. నగరంలోని తూర్పు, పశ్చిమ తమ్మిలేరు పాయల్లో వరద నీరు ఉరకలెత్తడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఏలూరు శనివారపుపేట కాజ్‌వేపైకి నాలుగు అడుగులకు పైగా నీటి ప్రవాహం ఉండటంతో వాహన రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. ఏటిగట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలపై అధికారులు దృష్టి సారించారు. గురువారం సాయంత్రం 3 గంటలకు 1వ ప్రమాద హెచ్చరిక జారీ చేయగా శుక్రవారం ఉదయానికి వరద మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. శనివారపుపేట కాజ్‌వే వద్ద భద్రతా ఏర్పాట్లను డీఎస్పీ బి.శ్రావణ్‌కుమార్, ఆర్డీఓ ఖాజావలి పర్యవేక్షించారు. ఆర్ఆర్‌పేట సుబ్బమ్మదేవి స్కూల్ ప్రాంతం నుంచి ఇజ్రాయేల్‌పేట వైపు వెళ్లే మార్గంలో బాలయోగి వంతెన, జంగారెడ్డిగూడెం మార్గంలో తంగెళ్లమూడి బ్రిడ్జి వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఆర్ఆర్ అటానమస్ కళాశాల ప్రాంతంలోని లోబ్రిడ్జి, పెదపాడు వెళ్ళే రహదారిలో కొత్తూరు జూట్‌మిల్లు ప్రాంతంలోని తమ్మిలేరు కాజ్‌వే వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. పశ్చిమ లాకుల వద్దకు ప్రజలు వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటుచేశారు.

నిరంతరం.. అప్రమత్తం : ఆర్డీఓ ఖాజావలీ ఆధ్వర్యంలో వరద సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. తంగెళ్లమూడి మెహర్ మసీదులో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు పరిశీలించారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు ముందుస్తు చర్యలు చేపడుతున్నారు. సుమారు 2,500 ఇసుక బస్తాలను సిద్ధం చేశారు. తాపీమేస్త్రీ కాలనీ, కుమ్మరిరేవు, టైటస్ నగర్, రాణినగర్, కొత్తపేట, పత్తేబాద ప్రాంతాల్లో వరద నీరు రాకుండా చర్యలు చేపట్టారు. 40 మంది ప్రైవేటు వ్యక్తులతోపాటు 100 మంది నగరపాలక సిబ్బంది, అధికారులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు.

13 కుటుంబాలకు పునరావాసం

తమ్మిలేరు ఎగదన్నడంతో తంగెళ్లమూడి ప్రాంతంలోని 13 ఇళ్లలోకి నీరు చొచ్చుకువచ్చింది. దీంతో సుమారు 50 మంది బాధితులకు మెహర్ మసీద్‌లో పునరావాసం కల్పించారు. జనావాసాల్లోకి వరద నీరు చేరకుండా కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. మార్కెట్ కమిటీ వైపు వెళ్లే దారిలో తమ్మిలేరు ప్రవాహానికి అడ్డంకి ఉన్న వ్యర్థాలను పొక్లయిన్‌తో తొలగిస్తున్నారు.

గత ప్రభుత్వంలో రూ.70 కోట్లతో రివిట్‌మెంట్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నగరంలో తమ్మిలేరుకు ఇరువైపులా రూ.70 కోట్లతో రివిట్‌మెంట్లు నిర్మించారు. దీనిద్వారా పలు ప్రాంతాలకు వరద నుంచి శాశ్వత రక్షణ కల్పించారు. అలాగే శనివారపుపేట కాజ్‌వేపై వంతెన నిర్మించాలచి యోచించినా ప్రభుత్వం మారడంతో కార్యరూపం దాల్చలేదు. ఇక్కడ వంతెన నిర్మించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

చందా.. దందా

- వినాయక చవితి విరాళాలకు టార్గెట్లు
- కూటమి నాయకుల వసూళ్ల పర్వం
- అపార్ట్‌మెంట్లపై ప్రత్యేక దృష్టి
- ఒక్కో ఫ్లాట్ నుంచి రూ.5 వేల వరకు వసూలు

భీమవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హత్యలు, దాడులు, విధ్వంసాలు పెరిగిపోగా.. తాజాగా కూటమి నాయకులు వినాయకచవితి చందాలకు టార్గెట్లు పెట్టి మరీ వసూలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లలో నివాసముంటున్న వారిని విరాళాలు డిమాండ్ చేస్తున్నారని మధ్యతరగతి ప్రజలు లబోదిబోమంటున్నారు. వచ్చే నెల 7న వినాయక చవితి దృష్ట్యా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రం భీమవరం పట్టణంలోని పలు అపార్ట్‌మెంట్ల వద్ద కొందరు నాయకులు బృందాలుగా ఏర్పడి విరాళాలకు టార్గెట్లు విధిస్తున్నట్టు తెలిసింది. అపార్ట్‌మెంట్‌లోని ఒక్కో ఫ్లాట్ నుంచి రూ.5 వేల చొప్పున ఇవ్వాలని చెప్పి మరీ వసూళ్లు చేస్తున్నారు. భీమవరంతో పాటు సమీపంలోని చినఅమిరం, రాయలం గ్రామాల్లో సైతం పెద్ద సంఖ్యలో అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. దాదాపు పట్టణంలోనే 160 వరకు అపార్ట్‌మెంట్లు ఉంటాయని అంచనా. కొందరు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బృందాలుగా ఏర్పడి అపార్ట్‌మెంట్ల వద్ద ఉత్సవాల నిర్వహణకు సన్నద్ధం చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో వారు నిర్ణయించిన విరాళం మొత్తం ఇవ్వకుంటే ఇబ్బందులు తప్పవనే హెచ్చరికలతో వివిధ గ్రామాల నుంచి పిల్లల చదవులు, ఉద్యోగాల కోసం వచ్చి పార్ట్‌మెంట్లలో ఉంటున్న మధ్యతరగతి వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఉత్సవాల నిర్వహణకు తమ స్థోమతను బట్టి విరాళాలు ఇస్తామని, ఇలా పెద్ద మొత్తంలో డిమాండ్ చేయడం ఏంటని మండిపడుతున్నారు. సాధారణంగా అపార్ట్‌మెంట్ల వద్ద ఏటా చవితి ఉత్సవాలను కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటాయి. అయితే ఈ ఏడాది కూటమి నేతలు టార్గెట్ పెట్టి మరీ విరాళాల వసూళ్లకు పూనుకోవడం చర్చనీయాంశం.

క్లుప్తంగా

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలి



మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రతి ఆదివాసీ గిరిజనులు గ్రామగ్రామంలో ఘనంగా జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం ఆయన దుద్దుకూరులో విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, చట్టాలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. అర్హులైన పోడు భూమి రైతులకు పట్టాలు ఇచ్చారని, గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు రూ.50 కోట్లతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం కోసం నిధులు కేటాయించారని చెప్పారు. ప్రస్తుతం ఆస్పత్రి నిర్మాణ దశలో ఉందన్నారు. అలాగే గిరిజన ప్రాంతంలో నాడు టీడీపీ పాలనలో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలను నాడు–నేడు పథకం ద్వారా రూపురేఖలు మార్చి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారని అన్నారు. కూటమి ప్రభుత్వం కూడా గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చెయ్యాలని కోరారు. వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

బాలిక అదృశ్యం

యలమంచిలి: పదిహేడేళ్ల తన కుమార్తె కనిపించడం లేదని ఓ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తన ఇంట్లో ఈ నెల 6వ తేదీన రాత్రి కుటుంబ సభ్యులు భోజనం చేసి నిద్రించారు. రాత్రి రెండున్నర గంటలకు తండ్రికి మెలకువ వచ్చి చూడగా కుమార్తె కనిపించలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపిన విషయం గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. కుచ్చుల మెట్టపై గతంలో ఒక మండపం ఉండగా, ఇప్పటికీ శిథిల జాడలు ఉన్నాయి. పది రోజుల క్రితం కొందరు వ్యక్తులు ఈ మండప ప్రాంతంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. ఆ సమయంలో బండ రాయి కింద నుంచి పెద్ద తాచుపాము రావడంతో వారు పరుగులు తీసినట్టు చెబుతున్నారు. తరువాత ఆ వైపు వెళ్లేందుకు ధైర్యం చేయలేదు. కొందరు పశువుల కాపరులు ఈ తవ్వకాలు చేశారని చెబుతున్నారు.

గోదావరికి మళ్లీ వరద

- 20వ రోజూ జలదిగ్బంధంలోనే గ్రామాలు
- నీటమునిగిన రుద్రమకోట, రహదారి
- పొంగి ప్రవహిస్తున్న పెద్దవాగు



పొంగి ప్రవహిస్తున్న పెద్దవాగు

వేలేరుపాడు: భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం మళ్లీ పెరుగుతోంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు బుధవారం రాత్రి 33 అడుగులు ఉన్న నీటి మట్టం గురువారం రాత్రి 38.7 అడుగులకు చేరుకుంది. గరువారం రాత్రికి మరో రెండు అడుగులు పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. పెద్దవాగు, శబరి ఎగపోటు వల్ల వేలేరుపాడు నుంచి రుద్రమకోట వైపు రహదారి పెద్దవాగు వంతెన ప్రాంతంలో నీటమునిగింది. దీంతో రుద్రమకోటకు వేలేరుపాడు నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం రాత్రి వేలేరుపాడు నుంచి కన్నాయిగుట్ట వైపు రహదారిలో మేళ్లవాగు వంతెన మళ్లీ నీటమునిగింది. వేలేరుపాడు నుంచి కన్నాయిగుట్ట గ్రామానికి రాకపోకలు స్తంభించడంతో భూదేవిపేట, బుర్రతోగు, చాగరపల్లి మీదుగా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మండలంలో దిగువున ఉన్న 18 గ్రామాలు 20వ రోజు కూడా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. వేలేరుపాడు–కొయిదా రహదారిలో ఎద్దెలవాగు, టేకూరు, తదితర వాగుల వంతెనలు నీటమునిగే ఉన్నాయి. పెద్దవాగు పొంగి ప్రవహిస్తుండటంతో వెంబడి ఉన్న కమ్మరిగూడెం, ఒంటిబండ, రామవరం ఊటగుంపు తదితర గ్రామాలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయి 22 రోజులు అవుతోంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు నరకయాతన పడుతున్నారు.

ఎల్ఎన్‌డీపేట నుంచి 3వేల క్యూసెక్కుల విడుదల

పోలవరం రూరల్: కొండ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్‌లోకి భారీగా వర్షం నీరు చేరడంతో నిండుకుండలా మారింది. గురువారం రిజర్వాయర్ నుంచి 3వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. రిజర్వాయర్‌లో 90 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. ఎఫ్ఆర్ఎల్ లెవల్ 90.50మీటర్లు కావడం, ఇన్‌ఫ్లో పెరుగుతుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మూడు గేట్లు ఎత్తి 3వేల క్యూసెక్కుల నీటిని దిగువుకు విడుదల చేశారు. మార్గమధ్యలో కాజ్‌వేలపై నీరు పొంగి ప్రవహించడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఉధృతంగా ప్రవహిస్తున్న తమ్మిలేరు
మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

చింతలపూడి: ఎగువున కురుస్తున్న భారీ వర్షాలకు తమ్మిలేరు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంది. గురువారం అధికారులు మూడు గేట్లు ఎత్తి 6,200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. తమ్మిలేరు ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 348.77 అడుగులకు, గోనెలవాగు బేసిన్ 348.67 అడుగులకు చేరుకుందని తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ పరమానందం చెప్పారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి అలుగుపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో గంటకు 5,560 క్యూసెక్కుల నీరు ఆంధ్రా కాల్వ ద్వారా ప్రాజెక్టులోకి చేరుతోందన్నారు. ప్రాజెక్టులో 350 అడుగుల వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చునని అధికారులు చెప్పారు. వరద పరిస్థితిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



నాగిరెడ్డిగూడెం రిజర్వాయర్ నుంచి విడుదల చేస్తున్న నీరు



రుద్రమకోట రహదారి మీదుగా ప్రవహిస్తున్న వరద నీరు



ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

చికిత్స పొందుతూ భార్యాభర్తలు మృతి

తాడేపల్లిగూడెం అర్బన్: గ్యాస్ లీకై సంభవించిన అగ్నిప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన భార్యాభర్తలు స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. ఏపీ టిడ్కో గృహాల వద్ద ఈనెల 6న గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు బోడపాటి మురళీ, కుమారి, వీరి కుమార్తె నీలిమకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వీరిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. శనివారం నుంచి గురువారం వరకు వారికి వైద్యసేవలు అందించారు. భార్యాభర్తలకు సుమారు 80శాతానికి పైగా శరీరాలు కాలిపోయాయని, మెరుగైన వైద్యసేవలందించి వారిని కాపాడేందుకు ప్రయత్నించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యనారాయణ చెప్పారు. భార్యభర్తల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు. కాగా ఈ ప్రమాదంలో గాయాలపాలైన కుమార్తె నీలిమ కోలుకుంటోందని, ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

హైవేపై చైన్ స్నాచింగ్

యలమంచిలి: భర్తతో కలిసి బైక్‌పై వెళుతుండగా వెనుకే వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని యువకులు వివాహిత మెడలో నుంచి మూడు కాసుల బంగారపు నల్లపూసల తాడును లాక్కుని పరారయ్యారు. ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మలికిపురానికి చెందిన పెద్దిరెడ్డి దేవి తన భర్త సుబ్బారావుతో కలిసి మోటార్ సైకిల్‌పై పాలకొల్లు వెళ్లారు. పనుల అనంతరం మలికిపురం తిరిగొస్తుండగా, చించినాడ జాతీయ రహదారిపై దిగమర్రు ఇటుకల బట్టీ దగ్గరకు వచ్చేసరికి వెనుక నుంచి బైక్‌పై వేగంగా వచ్చిన ఇద్దరు యువకులు దేవి మెడలో ఉన్న మూడు కాసుల నల్లపూసల తాడు లాక్కుని పారిపోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గుర్రయ్య చెప్పారు.

అనుమతులు లేని బ్యారన్లను కూల్చివేస్తాం

పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్



కొయ్యలగూడెం వేలం కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్

కొయ్యలగూడెం: అనుమతులు లేకుండా వర్జీనియా పొగాకు బ్యారన్లను నిర్మిస్తే వాటిని కూల్చివేస్తామని చైర్మన్ యశ్వంత్ కుమార్ హెచ్చరించారు. గురువారం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు పొగాకు క్యూరింగ్ కోసం ఇబ్బడిముబ్బడిగా అనుమతులు లేకుండా బ్యారన్లను నిర్మించుకుంటున్నారని, ఇది బోర్డు నియమావళికి విరుద్ధమన్నారు. రైతులకు తుపాను వలన కలిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని వర్జీనియా పొగాకు రైతులను ఆదుకునే ఉద్దేశంతో అదనపు పంట విక్రయంపై అదనపు సుంకం రద్దు చేశామని, ఈ విధానం భవిష్యత్తులో ఉండబోదన్నారు. అదనపు సుంకం రద్దు వల్ల వర్జీనియా పంట పండించే ప్రతి రైతుకు రూ.40 వేల నుంచి రూ.1లక్ష వరకు లబ్ధి చేకూరిందన్నారు. బ్రెజిల్, జింబాబ్వే దేశాలు వచ్చే సంవత్సరానికి సంబంధించి పరిమితిలేని విధంగా పంటను వేసుకునేలా అక్కడి ప్రభుత్వాలు వెలుసుబాటు కల్పించిందని, దీని ద్వారా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో సాగు విస్తీర్ణం తగ్గించుకోవాలన్నారు. నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేస్తేనే వచ్చే సీజన్‌లో రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక రైతుల సమస్యలను రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల నంది, ఎస్‌కే సయ్యద్ బాజీ (సైదులు) ముప్పనాపల్లి రామచంద్రరావు, అడప సత్తిబాబు తదితరులు చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదనపు సుంకం రద్దు చేసినందుకు కృతజ్ఞతగా చైర్మన్‌ని రైతులు సత్కరించారు. ఆర్ఎం జీఎల్‌కే ప్రసాద్, ఏఎస్ గ్రేసీ మార్గరేట్ పాల్గొన్నారు.

బాలిక కుటుంబాన్ని ఆదుకుంటాం

ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా సోమ శంకర్‌నాయక్

నూజివీడు: ముక్కుపచ్చలారని నాలుగేళ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడటం అనాగరికమని, బాలిక కుటుంబానికి ఎస్టీ కమిషన్ తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా సోమ శంకర్‌నాయక్ చెప్పారు. పల్లెర్లమూడిలోని బాలిక ఇంటిని సోమశంకర్‌నాయక్ గురువారం సందర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సంఘటనకు సంబంధించిన పూర్వపరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటన చోటుచేసుకోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. పోలీసులు 24 గంటల్లోనే నిందితుడిని పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల ఆర్థికసాయం అందజేసేలా కృషి చేస్తామన్నారు. డాక్టర్ సర్టిఫికెట్ రాగానే రూ.2.50 లక్షలు, కోర్టులో పోలీసులు చార్జీషీట్ వేసిన తరువాత రూ.1.25 లక్షలు, నిందితుడికి శిక్ష పడిన తరువాత మిగిలిన రూ.1.25 లక్షలు అందజేస్తామన్నారు. అలాగే రెండు ఎకరాల వ్యవసాయ భూమిని అందజేయాలని ప్రభుత్వానికి ఎస్టీ కమిషన్ తరపున సిఫార్సు చేస్తామన్నారు. బాలిక ఎంత వరకు చదువుకుంటానంటే అంత వరకు ఉచిత విద్యను అందజేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్‌చార్జి ఆర్డీఓ భాస్కర్, ఐటీడీఏ కేఆర్‌పురం పీవో శ్రీనుకుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ సుబ్బారావు, రూరల్ సీఐ కె.రామకృష్ణ, రూరల్ ఎస్సై మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.



పల్లెర్లమూడి బాలిక ఇంట్లో పోలీసు అధికారులతో మాట్లాడుతున్న సోమశంకర్ నాయక్

స్టేట్ టోల్ చార్జీల వసూలు సరికాదు

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర రహదారులపై ప్రయాణించే వాహనాలకు టోల్ చార్జీలు వసూలు చేయాలన్న ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. వెయ్యి కిలోమీటర్ల పరిధిలో టోల్ వసూలు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని, అదే జరిగితే భవిష్యత్తులో మొత్తం 12,650 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులపై టోల్ వసూలు చేసే ప్రమాదం ఉందన్నారు. రోడ్ల అభివృద్ధి, సక్రమ నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత అని గుర్తు చేశారు. వాహనాల లైఫ్ టాక్స్, డీజిల్, పెట్రోల్‌పై, రోడ్డు సెస్సు తదితర రూపాల్లో ప్రభుత్వాలకు ఆదాయం సమకూరుతోందన్నారు. పీపీపీల పేరిట రాష్ట్ర రహదారుల్లో ప్రతిపాదిత టోల్‌టాక్స్‌లు మోయలేని భారాలుగా మారి రాష్ట్ర రవాణా రంగాన్ని నష్టాలపాలు చేస్తాయని విమర్శించారు. దీని వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై వెంటనే పునరాలోచన చేసి ఈ ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని కోరారు.

ఆల్ ద బెస్ట్.. జ్యోతికశ్రీ

ఒలింపిక్స్ 400 మీటర్ల రిలే పరుగులో నేడు తణుకు క్రీడాకారిణి ప్రదర్శన



అథ్లెటిక్ క్రీడాకారిణి దండి జ్యోతికశ్రీ



తణుకులో జ్యోతికశ్రీని ప్రోత్సాహిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తణుకు అర్బన్: పారిస్ ఒలింపిక్స్‌లో తణుకుకు చెందిన పరుగుల రాణి దండి జ్యోతికశ్రీ శుక్రవారం పాల్గొనే 400 మీటర్ల రిలే పరుగు పోటీల్లో ప్రదర్శనపై పట్టణవాసులతో పాటు జిల్లా వాసులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. మధ్యాహ్నం 2.22 గంటలకు జరిగే ఈ పోటీల్లో దండి జ్యోతికశ్రీ మెరుగైన ప్రదర్శన ఇచ్చి భారతదేశానికి బంగారుపతకం సాధించాలంటూ ఆమెను ప్రోత్సహిస్తూ పట్టణంలోని పలు సెంటర్లలో గురువారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో జ్యోతికశ్రీ పేరు మారుమోగుతోంది. ఈ సందర్భంగా జ్యోతికశ్రీకి అభిమానులు ఆల్ ద బెస్ట్ చెబుతున్నారు.

సిమెంట్ డీలర్‌షిప్ ఇప్పిస్తానని మోసంపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: ఓ సిమెంట్ కంపెనీ డీలర్‌షిప్ ఇప్పిస్తానని మోసం చేసిన ఓ వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఓ సిమెంట్ కంపెనీకి జిల్లా సేల్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఉండేల కిరణ్‌కుమార్ రెడ్డి 2023 డిసెంబర్‌లో ద్వారకాతిరుమలకు చెందిన పొనమాల నాగరాజేష్, తిమ్మాపురానికి చెందిన షేక్ బాషాల వద్దకు వెళ్లి సిమెంట్ కంపెనీ డీలర్‌షిప్ ఇప్పిస్తానని నమ్మించాడు. దీనికి సమయం పడుతుందని, అప్పటివరకు కంపెనీ నుంచి సిమెంట్ ఇప్పిస్తానని చెప్పాడు. దీంతో అతనిని నమ్మిన నాగరాజేష్ బ్యాంకు ఖాతా నుంచి రూ.2.08 లక్షలు, షేక్ బాషా బ్యాంకు ఖాతా నుంచి రూ.1.56 లక్షలు, వెరసి మొత్తం రూ.3.64 లక్షలను కిరణ్‌కుమార్‌రెడ్డి బ్యాంకు అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. నెలలు గడుస్తున్నా సిమెంట్ సరఫరా కాకపోవడంతో మోసపోయినట్టు గుర్తించిన బాధితులు స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అడవి తల్లే ఆరాధ్య దైవం

- అడవితల్లి బిడ్డలకు ఆచారాలు, సంప్రదాయాలే వారి బలం
- ఏ పండగైనా కలిసి చేసుకుంటున్న కొండరెడ్డి గిరిజనులు
- వైఎస్సార్ సీపీ హయాంలో గిరిజన సంక్షేమానికి పెద్దపీట
- మారుమూల పల్లెల్లో సైతం విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- ప్రస్తుతం గిరిపుత్రులకు మళ్లీ పునరావృతమవుతున్న కష్టాలు
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



మారుమూల గిరిజన గ్రామం ఉప్పరిల్ల వ్యూ

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ గిరిజన తెగల్లో కొండరెడ్డి గిరిజనుల తెగ ఒకటి. వీరు నేటికీ కొండలపై ఆవాసాలు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నారు. అక్కడే వారి సంప్రదాయ పంటలైన జొన్న, సామలు, మొక్కజొన్న వంటి పంటలను పండిస్తూ జీవనం సాగిస్తున్నారు. అలాగే పలు గ్రామాల్లో వెదురు అల్లికలు, తేనె, చింతపండు, ఇప్పపువ్వు వంటి అటవీ ఉత్పత్తులను సేకరిస్తుంటారు. వారాంతపు సంత, ఇతర ప్రభుత్వ కార్యాలయ పనుల కోసం మాత్రమే కొండదిగి కిందకు వస్తుంటారు. సాంతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు కావొస్తున్నా నేటికీ కొండరెడ్డి గిరిజనులు కొండప్రాంతంలోనే జీవనం సాగిస్తూ వస్తున్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కొండరెడ్డి గిరిజనుల స్థితిగతులపై కథనం..

నేటికీ చెక్కుచెదరని సంప్రదాయం

నేటి ఆధునిక ప్రపంచంలో ఎవరి బతుకులు వారివే. ఎవరి పనులు వారివే. అయితే కొండరెడ్డి గిరిజనులు నేటికీ నాటి సంప్రదాయాలు, ఆచారాలకు కట్టుబడి ఉన్నారు. వ్యవసాయమే కాదు పెళ్లిళ్లు, పేరంటాలు ప్రతీదీ సమష్టిగా చేసుకునే సంప్రదాయం కొనసాగుతూనే ఉంది. శుభకార్యాల్లో ఒకరికి ఒకరు సహకరించుకోవడం వంటివి నేటికీ చేస్తుంటారు.

వైఎస్సార్ సీపీ పాలనలో గిరిజన సంక్షేమానికి పెద్దపీట

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేసింది. సుమారు 3,220 మంది గిరిజనులకు 69814.72 ఎకరాల్లో పోడు భూములకు పట్టాలిచ్చింది. అదేవిధంగా రైతు భరోసా పథకంలో రైతులకు ప్రతి ఏటా రూ.15 వేల పెట్టుబడి సాయం అందేలా కృషి చేసింది. అలాగే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానంతో కొండప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేసింది. వలంటీర్ వ్యవస్థ ద్వారా కొండపైన ఉన్నవారి ఇళ్లకు వెళ్లి పింఛను అందించింది. విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తూ గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందేలా సుమారు రూ.50 కోట్లతో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి కృషి చేశారు. ప్రస్తుతం ఈ ఆస్పత్రి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అలాగే వైద్యం కోసం డోలి కష్టాలు లేకుండా బైక్ అంబులెన్స్ సేవలను అందించారు.

వైభవంగా పండగల నిర్వహణ

ఆదివాసీ గిరిజనులు ప్రకృతినే ఆరాధ్య దైవంగా కొలుస్తుంటారు. రావి, వేప చెట్లను ముత్యాలమ్మగా భావిస్తారు. ముఖ్యంగా బాట పండుగ, పప్పుల పండుగ, మామిడికాయ పండుగ వంటివాటిని ఎంతో వైభవంగా నిర్వహిస్తుంటారు. అయితే గిరిజనుల్లోనే కోయ తెగ వారు భూదేవి పండుగను తొలకరి సమయంలో ఎంతో ఘనంగా జరుపుకుంటారు. నేటికీ ఈ పండుగ సంప్రదాయం కొనసాగుతూనే ఉంది.

కష్టాలు పునరావృతం

గత ప్రభుత్వంలో అందించిన పథకాలకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా మంగళం పలుకుతోంది. గతంలో డీసీఎం వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ అందించగా, ప్రస్తుత ప్రభుత్వం దీనిని తొలగిస్తున్నట్లు కలెక్టర్ల సమావేశంలోనే సీఎం తెలపడంతో మళ్లీ గిరిజనులకు వాగులు దాటుతూ తలపై బియ్యం మోస్తూ మైళ్ల దూరం నడిచే పరిస్థితులు రానున్నాయి. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థ ఉందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. గతంలో కోడి కూయక ముందే మారుమూల కొండ ప్రాంతాల్లో ఉన్న వారికి సైతం అన్ని రకాల పింఛన్లు అందేవి. ప్రస్తుతం ఆ పింఛన్లు వారం రోజులు దాటితేకానీ అందే పరిస్థితి లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా వైద్యసేవలపై కూడా ఆందోళన చెందుతున్నారు.



కామయ్యకుంటలో సంప్రదాయ డోలు, కొమ్ము నృత్యాలు చేస్తున్న గిరిజనులు (ఫైల్)



దొరమామిడిలో పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులు



ముంజులూరులో కొండవాగుల నుంచి నీటిని తీసుకువెళుతున్న గిరిజనులు (ఫైల్)



అటవీప్రాంతం నుంచి కట్టెలను మోసుకొస్తున్న గిరిజన మహిళ

క్లుప్తంగా

లక్ష్మీగణపతిస్వామి పంచామృతాలతో అభిషేకాలు



విశేష అలంకరణలో లక్ష్మీగణపతిస్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రావణమాసం గురువారం చవితి సందర్భంగా స్థానిక శ్రీ వాసవి ఆలయంలోని లక్ష్మీగణపతిస్వామికి పంచామృతాలు, ఫలరసాలు, సుగంధ ద్రవ్యాలు, విభూది, గంధంతో విశేష అభిషేకాలు, విశేష అలంకరణలు జరిగాయి. ఆర్యవైశ్య మహిళలు, భక్తులు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తణుకు టౌన్: విద్యార్థులు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పలువురు వక్తలు కొనియాడారు.గురువారం సెంట్రల్ జీఎస్టీ, రెడ్ క్రాస్, కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కేఆర్ ఫణిధర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా నిలుస్తారని తెలిపారు.విద్యార్థులు రక్తదానం పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు, భూపాల్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ విజయకుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఐవీ నారాయణ, విష్ణువర్ధన్, జీవన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

రామారావుకు రజక ఫెడరేషన్ చైర్మన్ పదవినివ్వాలి

తాడేపల్లిగూడెం రూరల్: రజక ఫెడరేషన్ చైర్మన్ పదవిని కాకినాడ రామారావుకు కేటాయించాలని అఖిల భారత దోభీ మహా సంఘం రాష్ట్ర కార్యదర్శిజొన్నాడ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. విజయవాడ నుంచి పెద్దాపురం వెళుతూ తాడేపల్లిగూడెంలో గురువారం కాకినాడ రామారావుకు అఖిల భారత దోభీ మహాసంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జొన్నాడ శ్రీనివాస్, రజక చైతన్య సేవా సంస్థ జిల్లా కన్వీనర్ ఊనగట్ల పోసికృష్ణలు మాట్లాడుతూ రామారావు సేవలను గుర్తింపుగా రజక ఫెడరేషన్ చైర్మన్ పదవి నిచ్చి గౌరవించాలన్నారు. కోటిచుక్కల రాము, వెల్లటి శ్రీనివాస్, పాలమూరి అన్నవరం, అంజూరి శ్రీనివాస్, పిప్పర ప్రసాద్, రేజర్ల భద్రాచలం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక హౌసింగ్ బోర్డు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సత్యవతి నగర్ ఫీడర్, అదే విధంగా టూటౌన్ ఫీడర్ల పరిధిలో మరమ్మతులు నిమిత్తం ఈనెల 9వతేదీ శుక్రవారం ఉద యం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వర రావు తెలిపారు. ఎఫ్‌సీఐ కాలనీ, వానపల్లి గూడెం, వీకర్స్‌కాలనీ, అబ్బులు కొట్టు సెంటర్, బాపూజీ పుంత రోడ్డు, అదే విధంగా టూ టౌన్‌లోని జువ్వలపాలెం, సవిత్రుపేట, బ్రహ్మానందరెడ్డి మార్కెట్ ఏరియా, కొత్తగూడెం, నవ్వారుపేట, బైపాస్ రోడ్డు, ఏలూరు రోడ్డు, కొబ్బరితోట, యాగర్లపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆస్పత్రిలో పండ్లు పంపిణీ



ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం: తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ క్యాంపస్ విద్యార్థులు గురువారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. హెల్త్‌కేర్ మేనేజ్‌మెంటు క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.అశోక్ విద్యార్థులు పాల్గొన్నారు.

మిషన్ శక్తిపై అవగాహన

పాలకోడేరు : మిషన్ శక్తి 100 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం శృంగవృక్షం అంగన్‌వాడీ సెంటర్‌లో లబ్ధిదారులకు, మహిళలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

క్రీడా మైదానాలు ఇలా.. ఆటలు ఆడేదెలా?



జెడ్పీ ఉన్నత పాఠశాలలో వర్షపు నీటిలో ప్లే గ్రౌండ్



కడకట్ల కోడే వెంకట్రావు మునిసిపల్ ఉన్నత పాఠశాలలో నీరు చేరిన దృశ్యం

- చిత్తడిగా ప్లే గ్రౌండ్లు
- వర్షాకాలంలో ఇదే దుస్థితి
- పాఠశాల ఆవరణలో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాఠశాలలకు చెందిన ముఖ్యమైన క్రీడా మైదానాలు అధ్వానంగా ఉన్నాయి. ఎన్నో ఏళ్లగా లోతట్టు ప్రాంతాల్లో ప్లే గ్రౌండ్‌లు ఉండటంతో పాటు భారీ వర్షాలు పడటంతో అవి నీటితో నిండి ఉన్నాయి. దీంతో విద్యార్థుల ఆట పాటలకు ఫుల్ స్టాప్ పడింది. విద్యార్థులు చదువులతో పాటు క్రీడలు జరగాలి. ఆట, పాటలు ఉంటేనే వాటిలో రాణిస్తేనే వారు మానసిక ఆనందం, శారీరక ధృడత్వం కలిగి ఉంటారు. చదువుల్లో సైతం రాణిస్తారు.

చిత్తడిగా ఆట స్థలాలు

పట్టణంలో మునిసిపల్ పాఠశాలలు ఆరు కాగా, ఒక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఒక జెడ్పీ ఉన్నత పాఠశాల ఉన్నాయి. మునిసిపల్ పాఠశాలలకు సంబంధించి ఈవీఎం స్కూల్, మాగంటి అన్నపూర్ణ స్కూల్, సంజీవనగర్ ఉన్నత పాఠశాల, సుబ్బారావుపేట పాఠశాల, యాగర్లపల్లి గాంధీ స్కూల్, కడకట్ల కోడే వెంకట్రావు పాఠశాలలతో పాటు కె.ఎన్.రోడ్డులో జెడ్పీ ఉన్నత పాఠశాల, నిట్ వద్ద ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈవీఎం, మాగంటి, సంజీవనరగ్, సుబ్బారావుపేట పాఠశాలలకు ప్లే గ్రౌండ్‌కు అనువైన స్థలాలు లేవు. అయితే గాంధీ మునిసిపల్ స్కూల్‌కు ప్లే గ్రౌండ్ మెరక చేసినప్పటికి వర్షం పడితే ఆ గ్రౌండ్ చిత్తడి మారి పిల్లలు ఆటలు ఆడేందుకు అనువుగా లేకుండా పోయింది. మరో పాఠశాల కోడే వెంకట్రావు మునిసిపల్ ఉన్నత పాఠశాల ప్లే గ్రౌండ్ అధ్వానంగా ఉండటంతో పాటు గడ్డి మొక్కలు బాగా పెరిగి పోవడంతో ఆటలు ఆడేందుకు వీలు లేకుండా పోయింది. గతంలో ఈ ప్లే గ్రౌండ్‌లో ఎన్నో ఆటల పోటీలు జరిగేవి. ప్రస్తుతం స్కూల్ భవనం వద్ద నీరు నిలిచి అపరిశుభ్ర పరిస్థితులు నెలకొన్నాయి. అదే విధంగా నిట్ సమీపంలోని ప్రభుత్వ బాలికొన్నత పాఠశాల ప్లే గ్రౌండ్ సైతం అస్తవ్యస్థంగా ఉండటంతో పాటు వర్షం నీరు నిలుస్తోంది. దీంతో అక్కడ కూడా ఆటలు ఆడే పరిస్థితులు లేవు.



నగరంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మొక్కలతో నిండిన క్రీడా మైదానం

జెడ్పీ ఉన్నత పాఠశాల అతి పెద్ద ప్లే గ్రౌండ్

అత్యంత్త ప్రాముఖ్యత ఉన్న కె.ఎన్.రోడ్డులోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు అతి పెద్ద ఆట స్థలం ఉంది. ఈ పాఠశాలలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడా ఉంది. వెయ్యి మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. ఒకప్పుడు ఈ పాఠశాల గ్రౌండ్‌లో జోనల్, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేవారు. షెటిల్ పోటీలు, క్రికెట్ పోటీలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. ఎన్నో ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరై ఈ గ్రౌండ్‌ను సద్వినియోగం చేసుకునేవారు. వాకర్స్ సైతం ఈ గ్రౌండ్‌లో నడక, వివిధ సేవాకార్యక్రమాలు చేసేవారు. ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు, మత సంస్థల సభలు, రాజకీయ సభలు, ఆధ్యాత్మిక సభలు, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ తదితర సంస్థల సభలు జరిగేవి. అనంతర కాలంలో గ్రౌండ్‌ను మెరక చేశారు. అయినప్పటికి ఆట స్థలంలో- లెవిల్ ఉండటంతో అవుట్ లెట్ లేకపోవడంతో వర్షం పడితే ఆట స్థలంలో నీరు నిలిచిపోతుంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు.



యాగర్లపల్లి మహాత్మా గాంధీ స్కూల్ దుస్థితి

వర్షపు నీటిలో పాఠశాలలు

పట్టణంలోని అన్ని పాఠశాలల ప్లే గ్రౌండ్‌లు వర్షపు నీటి నిల్వ కారణంగా అపారిశుద్ధ్య పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఈ నీటిలో దిగితే వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా విద్యార్థులు వాపోతున్నారు. ఎన్నో రాజులుగా నీటి నిల్వలు ఉండటంతో దోమలకు నిలయాలుగా మారాయి. మురుగు నీటిని బయటకు పంపే మార్గం ఆలోచన చేయాల్సి ఉంది. ఎంఈఓ జ్యోతి వివరణ కోరగా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి పాఠశాలల సమస్యను పరిష్కరిస్తామన్నారు.

అపరిశుభ్ర పరిస్థితుల్లో ఆట స్థలం



ఆట స్థలాలో అపరిశుభ్ర పరిస్థితలు నెలకుని ఉన్నాయి. గడ్డి మొక్కలు పెరిగిపోయాయి. వర్షం నీరు నిల్వ కారణంగా దుర్వాసన వస్తుంది. నీటిలో దిగితే విద్యార్థులకు వ్యాధులు ప్రబలే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్లే గ్రౌండ్‌ను మెరక చేయాలి.

– జి.హర్ష, కోడే వెంకట్రావు పాఠశాల విద్యార్థి

ఆటలు ఆడేందుకు వీలు లేకుండా పోయింది



ఆట స్థలాలలో వర్షపు నీరు నిల్వ ఉండటం, గడ్డి మొక్కలు భారీగా పెరగడంతో ఏ ఆటలు ఆడలేము. కొద్దిపాటి వర్షం పడితే ఆటలకు ఫుల్ స్టాప్ పెట్టాల్సిందే. గట్టిగా వర్షం పడితే కడకట్ల హైస్కూల్‌లో బాస్కెట్ బాల్ కోర్టు సైతం నీటిలో నిలిచిపోతుంది.

– జి.అజయ్, కోడే వెంకట్రావు పాఠశాల విద్యార్థి

ప్లే గ్రౌండ్‌ను అభివృద్ధి చేయాలి



జెడ్పీ ఉన్నత పాటశాల ప్లే గ్రౌండ్‌ను అభివృద్ధి చేయాలి. ఎంతో కాలంగా వర్షపు నీటితో నిండి ఉంది. దుర్వాసన రాకుండా చూడాలి. ఆటలు ఆడటానికి వీలు లేకుండా ఉంది. ఆటస్థలంను మెరక చేయాలి. అవుట్‌లెట్ ద్వారా నీటిని బయటకు పంపేందుకు చర్యలు చేపట్టాలి.

– ఆర్.యోగీశ్వరీ, జెడ్పీ పాఠశాల విద్యార్థినీ

మురుగు నీటిని తోడించాలి



పాఠశాల ఆవరణలో ఆపారిశుధ్య పరిస్థితులు ఉన్నాయి. గట్టిగా వర్షం పడితే ప్లే గ్రౌండ్ చిత్తడి చిత్తడిగా మారుతుంది. వర్షం పడితే ఎన్నో రోజులు పాటు నీరు నిల్వ ఉంటుంది. విద్యుత్ మోటార్‌లను ఉపయోగించి మురుగు నీటిని బయటకు తోడించాలి. ఆటలు ఆడేందుకు అవకాశం కల్పించాలి

– పి.దివ్య, జెడ్పీ పాఠశాల విద్యార్థినీ

తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

అత్తిలి: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీఎస్ సీడీపీఓ బి ప్రమోదకుమారి అన్నారు. తల్లిపాల వారోత్సవాలు, మిషన్ శక్తి కార్యక్రమాల్లో భాగంగా గురువారం తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు తిరుపతిపురం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ ప్రమోదకుమారి మాట్లాడుతూ బిడ్డపుట్టిన అరగంటలోపు ముర్రుపాలు తప్పనిసరిగా బిడ్డకు అందజేయాలన్నారు. బిడ్డకు తల్లిపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, విటమిన్ ఏ అధికంగా ఉండటం వల్ల కంటిచూపు బాగుంటుందన్నారు. కామెర్ల వంటి వ్యాధులు దరిచేరవని చెప్పారు. అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలలు పాటు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, వేరే ఏ ఇతర ద్రవాలు ఇవ్వరాదన్నారు. ఆరు నెలలు పూర్తైన అనంతరం అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్ల పూర్తయ్యే వరకు బిడ్డకు తల్లిపాలను అందించవచ్చన్నారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా పనిచేసే చోట్ల లైంగిక వేధింపుల చట్టం గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు జరిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం శ్రీదేవి, ఎమ్ఎస్‌కే రాగసుధ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎన్ వెంకటలక్ష్మి, పి మాధవి, ఆశా వర్కర్లు ప్రసన్న, స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): తల్లిపాల వారోత్సవాలలో భాగంగా స్థానిక 33వ వార్డు గొల్లగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎ.ఎన్.ఎం చిన్న పాప, దుర్గ, నాగమణి, లక్ష్మి రామ తులసి, పడాల శ్రీనివాస్, వీర్ల సత్యనారాయణ, గొబ్బిళ్ళ శ్రీను, సుగుణారావు, రాజేశ్, శ్రీను పాల్గొన్నారు.

తణుకు టౌన్: పుట్టిన బిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలే శ్రేయస్కరమని లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ వావిలాల సరళాదేవి తెలిపారు. గురువారం పైడిపర్రు-తేతలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరళాదేవి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పిల్లలకు తప్పనిసరిగా తల్లిపాలు అందజేయాలని కోరారు. బాల్య వివాహాలను ప్రోత్సాహించవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం అరుణ కుమారి, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ ఎం బాబూజీరావు, లయన్స్ నాయకులు సజని, ప్రసన్న, ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు. అలాగే పైడిపర్రు ప్రాజెక్టు పరిధిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



అత్తిలి: తిరుపతిపురంలో మాట్లాడుతున్న సీడీపీఓ ప్రమోదకుమారి



తాడేపల్లిగూడెం (టీఓసీ): సీమంతాలు చేస్తున్న సిబ్బంది



తణుకు టౌన్: దువ్వ గ్రామంలో అవగాహనా ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

తణుకు అర్బన్: మన ఆరోగ్యం మన చేతుల్లో అనే నినాదాన్ని హెచ్ఐవీ బాధితులకు ఒంటపట్టించే విధంగా సేఫ్‌కేర్ సెంటర్స్ వైద్యవర్గం కృషి చేయాలని సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (సీడీసీ) ఏపీ ఇన్‌చార్జ్ డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని సేఫ్‌కేర్ సెంటర్‌ను గురువారం సీడీసీ, షేర్ ఇండియా ఆర్గనైజేషన్ వైద్యబృందం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే అనే నినాదాన్ని రాష్ట్రంలో మొట్టమొదటిగా తణుకు సేఫ్ కేర్ సెంటర్‌లో ప్రవేశపెట్టి రోగులే నేరుగా బీపీ పరీక్ష చేసుకుని, బరువు చూసుకునే విధంగా కార్యాచరణ చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం ముందుగా సేఫ్‌కేర్ సెంటర్ సిబ్బందికి తగిన శిక్షణనిచ్చి అనంతరం మొదటిసారి రోగులకు చూపించి తర్వాత వారే చూసుకునే విధంగా సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. తద్వారా ఆరోగ్యంపట్ల వారు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అనారోగ్య సమస్యలు ఉంటే సంబంధిత వైద్యులను సంప్రదించాలని సూచించారు. క్రమం తప్పకుండా మందులు వాడుతూ వైద్యుల సూచనలు పాటిస్తే వారి జీవనకాలాన్ని పెంచుకోవచ్చనే విషయాన్ని రోగులకు తెలియజేప్పాలని అన్నారు. అనంతరం సెంటర్ వైద్యులు, సిబ్బందికి రోగులకు అందించాల్సిన వైద్యసేవలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో షేర్ ఇండియా స్టేట్ డైరెక్టర్ డాక్టర్ జయకృష్ణ, డాక్టర్ ప్రభు, టెక్నికల్ ఆఫీసర్స్, అజీత్, నళిని, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ జగదీష్, తణుకు సేఫ్‌కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.



తణుకు సేఫ్‌కేర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సీడీసీ ఏపీ ఇన్‌చార్జ్ డాక్టర్ రమేష్‌రెడ్డితో వైద్యబృందం

చిరు వ్యాపారిపై 'పంచాయతీ' దౌర్జన్యం

నోటీసు లేకుండా చేపల షెడ్డు తొలగింపు

పెంటపాడు: మండలంలోని కె. పెంటపాడులో చిరు వ్యాపారిపై పంచాయతీ సిబ్బంది సర్పంచ్ సత్యనారాయణ సూచనలతో పలువురు దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఎట్టకేలకు పెంటపాడు పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. సంఘటనకు సంబంధించి బాధితులు తాతారావు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎంతో కాలంగా వైఎస్సార్ విగ్రహం ఎదురుగా ఎస్‌డబ్ల్యూపీ స్కూల్ వద్ద వారానికి రెండు రోజులపాటు చేపల దుకాణం నడుపుకొంటున్న వ్యక్తి నల్లభై తాతారావుతో పాటు, మరి కొందరి చిరువ్యాపారులపై సర్పంచ్ దురుసుగా ప్రవర్తించినట్లు బాధితులు తాతారావు తెలిపారు. ఆ దుకాణం వల్ల ప్రజలకు ఇబ్బంది లేకపోయినా, షెడ్డుకు పంచాయతీ పన్ను కడుతున్నా సరే బుధవారం అర్ధరాత్రి ముందస్తు నోటీసు ఇవ్వకుండా కొందరి వ్యక్తులు జేసీబీతో కూల్చివేసారని బాధితుడు తాతారావు వాపోయాడు. దీంతో గురువారం ఉదయం తాతారావు బంధువులు, తూర్పు ఎస్ప్పేట ఇందిరానగర్ వాసులకు, పంచాయతీ సిబ్బందికి తీవ్ర వాగ్వాదం జరిగింది. సమాచారం తెలుసుకొన్న రూరల్ సీఐ రమేష్, పెంటపాడు ఎస్సై ఎస్ శంకర్‌లు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. ఇరువర్గాలతో చర్చించారు.



కె. పెంటపాడులో ధ్వంసం చేసిన చేపల దుకాణం

కొత్త క్రిమినల్ చట్టాలను నిలిపివేయాలి

తణుకు టౌన్: కేంద్ర ప్రభుత్వ జూలై 1 నుంచి అమలు చేస్తున్న క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఉభయ గోదావరి జిల్లాల ప్రదాన కార్యదర్శి కామన మునిస్వామి డిమాండ్ చేశారు. గురువారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త క్రిమినల్ చట్టాలను నిలుపుదల చేయాలని కోరుతూ లాయర్స్ యూనియన్, తణుకు బార్ అసోసియేషన్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కరోనా సమయంలో న్యాయవాదులతో గానీ, మేధావులతో గానీ కొత్త చట్టాలపై చర్చలు జరపకుండా అమోదించిన చీకటి చట్టాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భారత బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొండా శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, న్యాయవాదులు షేక్ సాబ్జి, పొట్ల సురేష్, కంకటాల శ్రీనివాసరావు, గూడూరి సత్యనారాయణ, బీ రాజేష్, ఉండ్రాజవరపు రాజేంద్ర, జువ్వల శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు పీ దక్షిణామూర్తి, జీ గోపి తదితరులు పాల్గొన్నారు.

ఐశ్వర్యదుర్గామాతకు విశేష పూజలు

అత్తిలి: మండలంలో శ్రావణమాసం సందర్భంగా అత్తిలి రామన్నపేటలో ఐశ్వర్యదుర్గా అమ్మవారికి గురువారం విశేష అభిషేకాలు, కుంకుమార్చనలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకుడు దాసరి నాగరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చేబ్రోలు రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

గూడెంలో 17.4 మిల్లీ మీటర్ల వర్షపాతం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెంలో గడచిన 24 గంటల్లో 17.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ గురువారం తెలిపారు. కాగా, పెంటపాడు మండలంలో 24.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

ప్రశాంతంగా స్కూల్ విద్యాకమిటీ ఎన్నికలు



పెంటపాడు: ఎస్టీవీఎన్ స్కూల్లో విద్యాకమిటీ ఎన్నికలో భాగంగా ఆమోదం తెలుపుతున్న పేరెంట్స్



అత్తిలి: బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నిక ప్రక్రియలో పాల్గొన్న పేరెంట్స్

పెంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ విద్యాకమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఒక్కో తరగతికి నుంచి ముగ్గురు చొప్పున పాఠశాల యాజమాన్య కమిటీకి సభ్యులుగా ఎన్నిక చేసుకొని వారిలో నుంచి చైర్మన్, వైస్ చైర్మన్ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పెంటపాడు బేసిక్‌స్కూల్, ఎస్టీవీఎన్ స్కూల్ ఎన్నికల్లో పాల్గొన్న విద్యాశాఖ అధికారులు టీవీ రామకృష్ణ, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఎన్నికైన ప్రతి ఒక్కరూ పాఠశాల అభివృద్ధికి పాటు పడాలన్నారు. విద్యార్థులను ప్రభుత్వ బడులలో చేర్పించేందుకు కృషిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు విద్యార్థులకు చేరేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాలలో ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది విద్యాకమిటీ నాయకులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బల్లిపాడు ఉన్నత పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నిక

అత్తిలి: నూతనంగా ఎన్నికైన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని గ్రామ ప్రముఖుడు ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ గారపాటి ధర్మయ్య అన్నారు. గురువారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నిక జరిగింది. మొత్తం 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గారపాటి బాబ్జి, గారపాటి అశోక్, ఆకుల రామచంద్రరావు, వాసు, గణేష్, ఉపాధ్యాయులు ఎస్ పురుషోత్తం, శ్రీనివాసరావు,మల్లేశ్వరరావు, శ్రీహర్ష, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని జిల్లా విద్యా శాఖాధికారి జి.నాగమణి గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలలో పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు అభినందనలు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల రోల్ పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ ఎస్.రవీంద్రభారతి, ఎంఈఓలు వి.హనుమ, పీఎంకే జ్యోతి, ప్రధానోపాధ్యాయులు ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

68 పాఠశాలల్లో ఎస్ఎంసీలు ఏర్పాటు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని 68 పాఠశాలలకు సంబంధించి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)లకు గురువారం ఎన్నికలు నిర్వహించారు. 49 ప్రైమరీ, 11 జిల్లా పరిషత్, మూడు గురుకుల పాఠశాలలు, ఐదు ఎంపీయూపీ పాఠశాలల్లో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, కోఆప్టెడ్ సభ్యులను తల్లిదండ్రులు ఎన్నుకున్నారు.